విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

హుస్నాబాద్‌టౌన్, మే 24: విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి కోరారు. హుస్నాబాద్ జడ్పీఉన్నతపాఠశాలలో ఐదురోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈకార్యక్రమానికి కేడం లింగమూర్తి హాజరై మాట్లాడారు. పేదలు, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు వస్తారనే విషయాన్ని గుర్తించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందనే విషయాన్ని గుర్తుచేస్తూ కొత్తవారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేయాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బండారి మనీలా,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

మర్కూక్‌లోని ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మర్కూక్,మే 24: విద్యాభివృద్ధికి పాటుపడాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఉపాధ్యాయులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థుల ప్రవర్తనపై నిఘా పెట్టాలి



సైబర్ నేరాల పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

కొమురవెల్లి, మే 24 : విద్యార్థుల ప్రవర్తనపై నిఘా పెట్టాలని ఎస్సై రాజు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా శుక్రవారం ఆయన మహిళా రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై టీచర్లకు అవగాహన కల్పించడంతో పాటు నూతన చట్టాల గురించి తెలియజేశారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉం డాలని, వాట్సాప్‌లో వచ్చే లింక్స్ ఓపెన్ చేయవద్దని, మానవ తప్పిదం వల్లనే సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వ్యక్తిగత, బ్యాంకు సమాచారాన్ని తెలియని వ్యక్తులకు ఎప్పుడు తెలుపవద్దన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వాటి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవో కృష్ణ

గజ్వేల్, మే 24: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కృష్ణ కోరారు. శనివారం మండల పరిధిలోని సింగాటం ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన బడిబాట కరపత్రాలు, బ్యానర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతేడాది పాఠశాలలో జరిగిన వివిధ కార్యక్రమాలను కరపత్రంలో ముద్రించడం అభినందనీయమన్నారు. జూన్‌లో ప్రారంభమయ్యే బడిబాటలో అందరూ విధిగా పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంతోష్, ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి కాపర్ వైరు చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), మే24: గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి దాంట్లోని కాపర్‌వైరును చోరీ చేసిన ఘటన మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. మద్దూరు ట్రాన్స్‌కో ఏఈ రాజు తెలిపిన వివరాల ప్రకారం గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన నరేందర్, శ్రీనివాస్ వ్యవసాయ బావుల వద్ద ఉన్న 16కేవీ సామర్థ్యం గల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్‌వైరు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన కాపర్ వైరు విలువ రూ. 60వేలు ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'ప్రజాపాలన గాలికి వదిలేసిన రేవంత్‌రెడ్డి'

చిన్నకోడూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నకోడూరు, మే 24: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన గాలికివదిలేసి పదవి కాపాడుకోవడానికి మోదీతో చెలిమి చేస్తున్నాడని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కాముని ఉమేశ్ చంద్ర అన్నారు. మండల కేంద్రంలో శనివారం రైతు బంధు సమితి మాజీ డైరెక్టర్ మేడికాయల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి కేసీఆర్, హరీశ్‌రావును విమర్శించడం తప్పా రాష్ట్రానికి ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కి పదవి కాపాడుకోవడానికి చంద్రబాబునాయుడు గోదావరి నీళ్లు అడ్డదారిన తరలించుకపోవడం చూస్తుంటే రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి ప్రపంచంలోనే ఎవరూ ఊహించని విధంగా కేసీఆర్, హరీశ్‌రావు కాలేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే ఒక పిల్లర్ కుంగితే ప్రాజెక్టునే రేవంత్‌రెడ్డి తప్పుపట్టడం సరికాదన్నారు. సమావేశంలో పూసల మహేశ్, ఇట్టమేన శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

కోహెడ తహసీల్దార్‌కు సన్మానం

కోహెడ మే 24: మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్‌ను శనివారం కుర్మ సంఘం మండల నాయకుడు కోనే శేఖర్, బీఆర్ఎస్ నాయకుడు పిడిశెట్టి రాజు శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ..వీరభద్రస్వామి కల్యాణం

లద్నూర్‌లో వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), మే24:మద్దూరు మండలం లద్నూర్ వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 22న ప్రారంభమైన ఆంజనేయ, కాలభైరవ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం ఆవాహిత దేవతా పూజలు, హోమాలు, గర్భన్యాసం, మూర్తియంత్ర ప్రతిష్ఠా, ప్రాణప్రతిష్ఠా, నేత్ర ఉన్మీలనం, మహాపూర్ణాహుతితో పాటు భ్రమరాంభిక సహిత వీరభద్రస్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం చేశారు. అర్చకులు దూసకంటి రాజేశ్‌శర్మ, నవీన్‌శర్మ, వంశీకృష్ణశర్మ, సాయిచరణ్, వేణుశర్మ, ఆలయక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చేర్యాల సీఐ శ్రీను

చేర్యాలలో ఎరువులు, విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న సీఐ శ్రీను

చేర్యాల, మే 24 : పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శనివారం చేర్యాల పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్లు, డెలివరీ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, షాపుకు సంబంధించిన వివిధ రికార్డులు, ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. అనంతరం చేర్యాల సీఐ శ్రీను మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులను మోసంచేసే వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పక బిల్లులు తీసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో విడిగా లభించే విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. షాపుల నిర్వాహకులు నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించవద్దన్నారు.గ్రామాల్లో విడిగా విక్రయాలు జరిపితే రైతులు కొనుగోలు చేయవద్దని, నకిలీ విత్తనాలు అమ్మితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.తనిఖీలో మండల వ్యవసాయాధికారి భోగేశ్వర్,ఏఈవో ప్రవీణ్, రవళి, ప్రొబేషనరీ ఎస్సై సమత, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్‌టౌన్, మే 24: నకిలీవిత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం సాయంత్రం వ్యవసాయాధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదులు పొందాలని సూచించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగుమందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులు సైతం అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో విడి విత్తనాలు విక్రయిస్తున్నా, నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే 100కు సమాచారం అందించాలని కోరారు. హుస్నాబాద్ మండల వ్యవసాయాధికారి శ్రేయ, ఎస్సై తోట మహేశ్, ప్రొబేషనరీ ఎస్సై నవీన్ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న పోలీస్, వ్యవసాయాధికారులు

జీలుగ విత్తనాల కోసం రైతుల ఇక్కట్లు

మద్దూరు ఆగ్రోస్ కేంద్రం వద్ద జీలుగ విత్తనాల కోసం ఎగబడుతున్న రైతులు

చేర్యాలలో జీలుగ,జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఈవో భోగేశ్వర్

జీలుగ విక్రయాలు ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మే24: భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు పంటల సాగుకు ముందు జీలుగ సాగు చేస్తారు. జీలుగ విత్తనాలను సరిపడా ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో అరకొర అందుబాటులో ఉన్న జీలుగ విత్తనాల కోసం రైతులు ఎగబడుతున్నారు. ఉమ్మడి మద్దూరు మండలం వ్యాప్తంగా సుమారు 500 ఎకరాలకు పైగా జీలుగ పంట సాగు చేస్తారని, దీని కోసం సుమారు 30 కిలోలకు సంబంధించిన 750 జీలుగ బ్యాగులు అవసరం ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం మద్దూరులోని ఆగ్రోస్ రైతు కేంద్రానికి 146 జీలుగ విత్తనాల బ్యాగులను సరఫరా చేసి చేతులు దులుపుకుంది. జీలుగ విత్తనాల సరఫరా కోసం కొన్ని రోజులుగా ఎదురుచూడగా అరకొరగా సరఫరా చేయడంతో ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతులు బారులు తీరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సరిపడా జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చేర్యాల, మే 24 : రైతులకు సరిపడా జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పి.భోగేశ్వర్ తెలిపారు.పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం జీలుగ, జనుము విత్తనాల విక్రయ పంపిణీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు జీరాక్స్, ఫోన్ నంబర్‌ను రైతు వేదికలో అందజేసి పర్మిట్ పొందాలన్నారు.వ్యవసాయశాఖ సిబ్బంది ఇచ్చిన పర్మిట్‌ను ఆగ్రో సేవా కేంద్రంలో అందజేస్తే సబ్సిడీ ధర చెల్లించి జీలుగ విత్తనాలు కొనుగోలు చేయవచ్చన్నారు. 30కిలోల జీలుగ విత్తనాల బ్యాగు రూ.2142, 40 కిలోల జనుము బ్యాగు రూ.2510 ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఎరువుల వాడకం తగ్గించి దిగుబడి పెంచుకోవాలన్నారు.156 బ్యాగుల జీలుగ, 75 బ్యాగుల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏఈవో రవళి, ఆగ్రోస్ సేవా కేంద్రం ప్రతినిధి పి.చంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి

దుబ్బాక,మే24: అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లి, ఎనగుర్తి గ్రామాల శివారులోని సర్వే నంబర్ 294లోని బాధిత రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 294 సర్వే నంబర్‌లో పేద రైతులకు గతంలో భూములు ఇచ్చిందన్నారు. ఆ భూములను అక్రమంగా క్రయవిక్రయాలు చేశారని, వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆభూములను తిరిగి రైతులకు అప్పగించకుంటే పోరాటం తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శశిధర్, మండల కార్యదర్శి ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ

కోహెడ, మే 24: మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో శనివారం అధికారులు పచ్చి రొట్ట ఎరువులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ బోయిని నిర్మల, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో సతీశ్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట ఎరువులు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో శివ, మహిపాల్, శ్రీధర్‌రెడ్డి, రూప, నాయకులు బోయిని జయరాజు, పేర్యాల నరేందర్‌రావు, పేర్యాల చొక్కారావు, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ధరలేక కూరగాయలు రోడ్డు పాలు

గౌరారం రాజీవ్ రహదారి పక్కన పడేసిన సొరకాయలు

ములుగు రాజీవ్ రహదారి పక్కన పడేసిన టమాటాలు

గజ్వేల్, మే 24: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర రావడం లేదు.దీంతో పండించిన టమాట, సొరకాయలను రైతులు రోడ్డు పక్కన పడేశారు. ములుగు, గౌరారం రాజీవ్ రహదారి పక్కనే టమాట, సొరకాయలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. కూరగాయ పంటలు సాగు చేసిన రైతులకు మార్కెట్‌లో అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

గ్రామాలను విలీనం చేయాలని వినతి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్ రూరల్, మే 24: అక్కన్నపేట మండలంలోని రేగొండ, గోవర్ధనగిరి, గౌరవెల్లి, చౌటపల్లి, జనగామ గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేయాలని కోరుతూ శనివారం హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ రేగొండ, గోవర్ధనగిరి, గౌరవెల్లి, చౌటపల్లి, జనగామ గ్రామాలు హుస్నాబాద్ మండలానికి పదికిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయని, ఇవి అక్కన్నపేట మండలంలో కొనసాగడం వల్ల ఆగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంపై దృష్టి సారించి త్వరలోనే గ్రామాలను విలీనం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌సుందర్‌గౌడ్, మేధిని వెంకటస్వామి, వికాస్‌యాదవ్, వెంకన్న, మల్లయ్య పాల్గొన్నారు.

గ్రామ పాలన అధికారుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ మనుచౌదరి

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పరీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట/ సిద్దిపేట టౌన్, మే 24: గ్రామ పాలన అధికారుల పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి గ్రామ పాలన అధికారుల పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడ గడియారం, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షకు 142 మంది అభ్యర్థులు హాజరవుతారని ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు వారి వెంట హాల్‌టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజుఫొటోలు, బ్లాక్ లేదా బ్లూ పెన్ను, గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సునీత, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, తహసీల్దార్ సలీంమియా, అసోసియేట్ ప్రొఫెసర్ అయోధ్యరెడ్డి పాల్గొన్నారు.

సర్వేయర్స్ శిక్షణ కోసం ఏర్పాట్లు చేయాలి

సిద్దిపేట,మే 24: లైసెన్స్‌డ్ సర్వేయర్స్ శిక్షణ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ హాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సర్వేయర్ల శిక్షణ కోసం 352 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడతలో శిక్షణ ఇచ్చేందుకు 176 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి జూలై 26 వరకు మొత్తం 50 పనిదినాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ, విద్యార్హతల ధ్రువీకరణ సర్టిఫికెట్లు (ఒరిజినల్), జిరాక్స్ కాపీలతో మొదటి రోజు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఏడీ వినయ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, తహసీల్దార్ సలీంమియా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లిలో గ్రామపంచాయతీని పరిశీలిస్తున్న డీపీవో దేవకీదేవి

మర్కూక్,మే24: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీపీవో దేవకీదేవి అధికారులకు సూచించారు.శనివారం ఆమె మండలంలో పర్యటించారు. మండల సమీకృత కార్యాలయాల భవనాల నిర్మాణం, మర్కూక్, నర్సన్నపేట గ్రామ పంచాయతీ, నూతన కార్యాలయ నిర్మాణ పనులతోపాటు ఎర్రవల్లిలో పర్యటించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంఈవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దుబ్బాక పట్టణంలో స్వచ్ఛత పాటించాలి

మరుగుదొడ్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక,మే24: స్వచ్ఛ దుబ్బాక కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం దుబ్బాక పట్టణంలోని అంగడి బజారులో మురుగుదొడ్లను మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగడి బజారులో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో వాటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గజ్వేల్‌లో తిరంగా యాత్ర

గజ్వేల్: తిరంగాయాత్రలో పాల్గొన్న పట్టణవాసులు, వైద్యులు

గజ్వేల్, మే 24: ఆపరేషన్ సిందూరుతో భారత సైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని ధైర్య సాహసాలను కీర్తిస్తూ భారత సైనిక విజయానికి మద్దతుగా శనివారం సాయంత్రం గజ్వేల్ పట్టణంలో తిరంగా యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో పట్టణవాసులు, యువకులు, వైద్యులు పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో

నారాయణరావుపేట, మే 24 : పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత త్రివిధ దళాలు చేసిన ఆపరేషన్ సిందూరుకు సంఘీభావంగా సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్‌లో ర్యాలీ, 2కే రన్ నిర్వహించారు. అనంతరం 2కే రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేసి నిర్వాహకులను అభినందించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, వాకర్స్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలి

జగదేవపూర్‌లో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

జగదేవపూర్, మే 24: ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి టీచర్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐదు రోజుల ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణను మండల విద్యాధికారి మాధవరెడ్డితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయన్నారు. 30మంది విద్యార్థులకు పైగా ఉన్న ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సై చంద్రమోహన్ ఉపాధ్యాయుల శిక్షణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని డీఈవోకు వినతి

వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవోను వారు కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో చేరి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మాధవరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి, శంకర్, బుద్ధ నాయక్, వెంకటేశ్వర్లు, కాంట్రాక్టు టీచర్లు, కరుణాకర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, రజితారెడ్డి, వకులాదేవి, భవానీ పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

గజ్వేల్, మే 24: కారు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొడకండ్లలో చోటుచేసుకుంది. కుకునూర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తలారి కరుణాకర్(30) శనివారం ఉదయం కూలీ పనికోసం కుకునూర్‌పల్లి వెళ్లేందుకు రాయవరం క్రాస్ వద్ద రోడ్డు దాటుత